www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 20 నవంబర్ 2024
5
తూర్పుగోదావరి

డిసెంబర్ 10న చలో విజయవాడ

ప్రజాశక్తి - తాళ్లపూడి

సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ డిసెంబర్ 10న తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎస్ ఉద్యోగుల సంఘం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు జోజాల వెంకటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మండలంలోని తాళ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ఉద్యోగులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. సిపిఎస్ రద్దు కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజకుమారి, శాంతి, దుర్గా భవాని, సుజాత, పద్మ, ప్రవీణ్, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాల కడలిలో 104 సిబ్బంది

- పిఎఫ్, ఇఎస్ఐ సొమ్మును గుంజుతున్న 'అరబిందో'
- అరకొర వేతనాలతో భారంగా కుటుంబ పోషణ
- సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట

వైద్య సేవలు అందిస్తున్న 104 సిబ్బంది

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

104 సేవలు అందిస్తున్న సిబ్బందిపై అరబిందో యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కోసం తన వాటా సొమ్మును యాజమాన్యం చెల్లించాల్సి ఉన్నా అవి కూడా ఉద్యోగుల వేతనాల నుంచే కోత విధిస్తోండటం విశేషం. ఈ నేపథ్యంలో యాజమాన్యం నిరంకుశ వైఖరిలో మార్పు రావాలని, వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యల పరిష్కారం కోసం 104 సిబ్బంది ఆందోళన బాట పట్టారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 60 వాహనాలు ఉండగా అందులో డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా 160 మంది పని చేస్తున్నారు. గతంలో 104 సేవలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించేది. 5 ఏళ్లుగా అరబిందో సంస్థ బాధ్యతలు చూస్తుండడం వల్ల ఉద్యోగుల సమస్యలను విస్మరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. 104 ఉద్యోగులను ఆప్కాస్ చేర్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని 2019 అక్టోబరు 31న గత ముఖ్యమంత్రి జగన్ హామీని ఇచ్చినా అమలు చేయలేదు.

ఆరోగ్య సేవల్లో కీలకంగా వ్యవహరిస్తూ...

పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో 104 వాహనాలు చాలా కీలకంగా పని చేస్తున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో వైద్య సేవలు అందించడంతోపాటు అవసరమయ్యే మందులను ఈ వాహనాల ద్వారానే ఇస్తుండడంతో పేద, మధ్య తరగతి రోగులకు ఎంతో ఉపశమనం కలుగుతుంది. అటువంటి సేవలను మరింతగా విస్తృతం చేసి వాహన సిబ్బంది సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వలన సిబ్బంది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అలాగే ఈ సేవలను మరింత విస్తృతపరచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆందోళన బాటలో...

గత ఐదేళ్ల పాలనలో అనేక కష్టాలు పడిన 104 సిబ్బంది కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయినా ఈ ప్రభుత్వంలోనూ అంతగా స్పందన కనిపించడం లేదని ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆందోళన బాట పట్టారు. ఈనెల 15,16,17వ తేదీల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు వినతిపత్రాలు అందించారు. 18,19,20 వ తేదీల్లో మండల స్థాయి ఎంపిపి, ఎంపిటిసిలకు వినతిపత్రాలు ఇస్తున్నారు. 21,22,23 వ తేదీలలో జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్‌పిటిసి సభ్యులకు, 24,25,26 తేదీల్లో ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు, 27,28 తేదీల్లో రాష్ట్ర మంత్రులకు, 29,30 తేదీల్లో రాజ్యసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులకు కూడా వినతి పత్రాలు అందించి సమస్యలు పరిష్కరించాలని కోరతామని ఉద్యోగులు తెలిపారు.

ఇవీ డిమాండ్లు

104 సర్వీసులను ప్రభుత్వం గతంలో మాదిరి నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలి. ప్రతీ నెల వేతనాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు చేపట్టాలి. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒలకు ఉద్యోగ భద్రత కల్పించి జిఒ నెంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలి. 3 సంవత్సరాల నుంచి యాజమాన్యం వెయ్యని ఇంక్రిమెంట్లు ఎరియర్ రూపంలో ఇవ్వాలి. డిఎస్ఆర్, ఆర్ఓఆర్ ద్వారా నియమించబడి రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘంగా సేవలందిస్తున్న 326 మంది సీనియర్ డ్రైవర్లను వైద్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలి. 74 మంది డ్రైవర్లను ఎప్పటి నుంచి వారికి అర్హత వచ్చిందో నాటి నుంచి స్లాబ్స్ అమలు చేయాలి. స్లాబ్ అమలు చేస్తామని అంగీకరించిన వారికి వేతనాలు యాజమాన్యం నుంచి ఇప్పించాలి. పిఎఫ్, ఇఎస్ఐ యాజమాన్యం వాటా యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పటి వరకూ అక్రమంగా వసూలు చేసిన యాజమాన్యం వాటా తమకు ఇప్పించాలి. గతంలో 104లో ఎప్పుడూ కూడా పిఎఫ్, ఇఎస్ఐ వాటాను యాజమాన్యం వాటా యాజమాన్యమే కట్టేవి. జిఒ 4459 ప్రకారం యాజమాన్యం చెల్లించాలి. వాహనాలకు ఫిట్ నెస్ ఇన్సూరెన్స్‌లు వెంటనే చేయించాలి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.

వెంటనే సమస్యలను పరిష్కరించాలి

104 వైద్య సేవలను ప్రభుత్వం మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలి. సిబ్బంది సమస్యలను తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సమస్యలపై శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో ఉధృత పోరాటాలు చేస్తాం.

ఎం. త్రిమూర్తులు, జిల్లా ప్రధాన కార్యదర్శి,
ఎపి104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్

తాళ్లరేవులో ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి వెల్లడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలుసుకున్నారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే విధంగా, ఉపాధ్యాయ సమస్యల మీద అలుపెరగని పోరాటం చేస్తానని అన్నారు. 1998వ సంవత్సరం నుంచి నేటి వరకు ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై పోరాటం చేసినట్లు చెప్పారు. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భారాలు లేకుండాను, బోధనేతర పనులు తొలగించే విధంగా కృషి చేస్తానని అన్నారు. కళాశాల రంగంలో ఉన్న జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల స్థిరీకరణకు సంబంధించి జిఒ 114 అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎయిడెడ్ కళాశాలలో పనిచేసే అన్ ఎయిడెడ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సగం విద్యారంగం ప్రయివేటు వ్యవస్థలోనే నడుస్తు ఉందని, ఆ వ్యవస్థలో పనిచేస్తున్న సిబ్బంది పలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు సాధించడానికి శాసనమండలిలో తన వంతు కృషి చేస్తానని అన్నారు. స్వర్గీయులైన ఎంవిఎస్ శర్మ, ఉద్యోగానికి రాజీనామా చేసి ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం కృషి చేస్తున్న తనను ఎంఎల్‌సిగా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, తొట్టిపూడి రాజా, బొజ్జ అశోక్, కాకర రవికుమార్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని రామన్ గృహాలు, రాజీవ్ కాలనీ వాసులకు సిఐ గణేష్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మోసాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఆన్‌లైన్ మోసాల నుంచి ఎలా బయటపడాలో అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని, మహిళలతో గౌరవంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ నాగేశ్వరరావు, ఎస్‌బి ఎఎస్ఐ సుభాకర్, హెడ్ కానిస్టేబుల్ మూర్తి పాల్గొన్నారు.

హమాలీల జీతాలు పెంచాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు సుందరబాబు

ప్రజాశక్తి - గోపాలపురం

పౌర సరఫరాల సంస్థలో పనిచేసే హమాలీల జీతాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. మంగళవారం గోపాలపురం సివిల్ సప్లయిస్ పాయింట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సుందరబాబు, ఉపాధ్యక్షులు గంటి కృష్ణ మాట్లాడారు. వేతన ఒప్పందం పూర్తయి 11 నెలలైనా ప్రభుత్వం నేటికీ స్పందించక పోవడం దారుణమన్నారు. పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీలకు రెండేళ్లకోసారి రాష్ట్ర ప్రభుత్వం వేతన ఒప్పందం చేసుకుంటుందన్నారు. గత ప్రభుత్వం 2024 జనవరి నాటికి ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందని, కాని జగన్ ప్రభుత్వం దాన్ని విస్మరించిందన్నారు. యూనియన్‌తో చర్చలు జరిపి తక్షణమే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయిస్‌లో హమాలీల పాత్ర కీలకమన్నారు. వారి పనిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. అన్ని ధరలూ విపరీతంగా పెరిగిపోవడంతో జీతాలు చాలక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతన ఒప్పందం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం గొడౌన్ నాయకులు ఎస్.వీర్రాజు, ఎస్.కృష్ణ, ఎల్.నాగేశ్వరరావు, ఎస్.సోమేశ్వరరావు, డి.చిన్నా, ఎల్.శ్రీనివాస్ కార్మికులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయొద్దు : సిపిఎం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే నిలిపేయాలని సిపిఎం డిమాండ్ చేశారు. మంగళవారం ధవళేశ్వరం సిఐటియు కార్యాలయంఓ కె.రంగారావు అధ్యక్షతన సిపిఎం శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కమిటీ సభ్యులు కర్రి రామకృష్ణ మాట్లాడారు. రైతులు, ప్రజలకు ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారన్నారు. ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహ అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారన్నారు. విద్యుత్ వినియోగదారుల అనుమతిలేకుండా నివాస గృహాలకు మీటర్లు బింగించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిని ప్రజలు ప్రతిఘటించాలన్నారు. వైసిపి హయాంలో పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి, జనసేను తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. నాడు మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చివారే నేడు మీటర్లు బిగిస్తుండం ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. అదాని, షిర్డీ సాయి సంస్థలతో కుమ్మక్కయ్యి, వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని విమర్శించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై భారం పెరుగుతుందన్నారు. విద్యుత్ కోసం ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. బ్యాలెన్స్ పూర్తి కాగానే అర్ధాంతరంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుంచే వసూలు చేస్తారన్నారు వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టేందుకే పంపు సెట్లకు మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాడు వైసిపి, నేడు టిడిపి జనసేన పార్టీలు ఈ మీటర్లను కొనసాగించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే 17 వేల కోట్ల రూపాయలు ట్రూ అప్ చార్జీల భారం వేస్తున్నారన్నారు. ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించటం తగదన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలని కోరారు. స్మార్ట్ మీటర్లు ఆపాలని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.దుర్గాప్రసాద్, సిహెచ్.రామకృష్ణ, ఆర్.రామకృష్ణ, డి.నారాయణ, డి.శేషారావు, ఎస్ఎ.రెడ్డి, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ తదితరులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ హోమ్‌లో మంగళవారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు పి.జయకర్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం పాఠశాల పని వేళలు ఒక గంట పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నియమిత పని గంటలు మించి విద్యార్థులకు బోధన సాగిస్తే పిల్లలు ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అధికారులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. మనో వైజ్ఞానికంగా, శాస్త్రీయంగా ఆలోచించాలని జయకర్ పేర్కొన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కాకినాడలో జరగనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా మహిళా అసోసియేట్ విజయ్‌గౌరి, జిల్లా కార్యదర్శులు శ్రీమణి, రమేష్, ప్రకాష్, ఎం.భాస్కర్, దయానిధి, నర్సారెడ్డి, నాగభూషణం, రాష్ట్ర నాయకులు రూపస్‌రావు, రాజేశ్వరి, చిలుకూరి శ్రీనివాసరావు, రాష్ట్ర పరిశీలకులు జి.రమణ వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జయకర్

డిఎ, ఇతర బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉపాధ్యాయులు డిఎ, ఇతర బకాయిలును వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఐ.రాంబాబు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ 50 వసంతాల వేడుక ఉండ్రాజవరంలో మంగళవారం జరిగింది. యుటిఎఫ్ మండల అధ్యక్షులు కుంకట్ల వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు నిర్వహించుకుంటున్నందుకు ఆనందంగా ఉందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి వివి రమణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల అధ్యక్షులుగా వైవి.స్వామి, ప్రధాన కార్యదర్శిగా బి.రామారావు, గౌరవాధ్యక్షులుగా ఎస్.లక్ష్మీనారాయణ, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.తాతారెడ్డి, అసోసియేట్ మహిళా అధ్యక్షురాలుగా ఎం.వెంకటలక్ష్మి, కోశాధికారిగా కె.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కార్యదర్శులు ఆర్ఎస్ఆర్.ఫణి, జి.శివప్రసాద్, ఎ.రత్నాకర్‌చౌదరి, ఎస్.మీరాసాహెబ్, సిహెచ్.శ్రీనివాస్, పిఎస్‌వి.సత్యనారాయణ, టి.పరమ పావని, ఎస్‌జి.రజియా, ఎం.సుధాకర్ ఎన్నికయ్యారు. జిల్లా మహాసభ ప్రతినిధిగా పి.వీరాంజనేయులు, ఎ.సూర్య కుమారి, ఎంవిఎల్.సునీత, ఆర్.సురేష్, డి.శ్రీనివాస్, ఎల్.అమ్మిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా యుటిఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సభలో మాట్లాడుతున్న రాంబాబు

వైద్య శాఖలో ఆరోగ్య సహాయకులు కీలకం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వైద్య, ఆరోగ్య శాఖలో ఆరోగ్య సహాయకులు మూల స్తంభాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సహాయకులకు రెండ్రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆనం కళా కేంద్రంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, జాగ్రత్తలపై ఆరోగ్య సహాయకులకు శిక్షణ అందిస్తామన్నారు. ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జె.సంధ్య జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు పాత్రను వివరించారు. జిల్లా మలేరియా సహాయ అధికారి నక్కా వెంకటేశ్వరరావు శిక్షణ విశిష్టతను వివరించారు. తొలిరోజు శిక్షణలో సీనియర్ ఎంటమాలజిస్ట్ ఐ.రామకృష్ణారావు, ఎంపిహెచ్ఇఒ జిఎస్ఎస్.నాగు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 51 మంది ఆరోగ్య సహాయకులు హాజరయ్యారు.

శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ వెంకటేశ్వరరావు

ర్యాంపు నిర్వాహకులు, ఇసుక వినియోగదారులతో మాట్లాడుతున్న జెసి చిన్నరాముడు

ఇసుక రవాణాకు ఆటంకం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

గృహ నిర్మాణ అవసరాలకు తీసుకెళ్తున్న ఉచిత ఇసుక రవాణాకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జెసి చిన్నరాముడు హెచ్చరించారు. మండలంలోని బల్లిపాడు ఇసుక ర్యాంపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణాలకు ఇసుక కావాల్సిన వారు విఆర్ఒల వద్ద అనుమతులు తీసుకుని ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లపై ఓపెన్ ఇసుక రీచ్‌ల నుంచి తీసుకెళ్లొచ్చన్నారు. వేగేశ్వరపురం, చిడిపి రీచ్‌ల నుంచి ఇసుకను స్టాక్ పాయింట్‌కు తరలించేందుకు గుత్తేదారులు ఎంపిక పూర్తయిందన్నారు. వీరు ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇసుకను స్టాక్ పాయింట్‌కు తరలించాల్సి ఉంటుందన్నారు. గుత్తేదారులు ట్రాక్టర్లతో తీసుకువెళ్లి ఇసుకను స్టాక్ పాయింట్‌కు తరలించకుండా బయట అమ్మేస్తున్నారని బల్లిపాడుకు చెందిన కూటమి నాయకులు శంకరం, జగదీష్, రమేష్ తదితరులు జెసికి ఫిర్యాదు చేశారు. ఇసుక ర్యాంపు వద్ద అధికారుల పర్యవేక్షణ ఉండాలని కోరారు. జెసి వెంట ఆర్‌డిఒ రాణి సుస్మిత, డిటి భారతి, రామకృష్ణ తదితరులున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ప్రజాశక్తి - కోరుకొండ

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని కోరుకొండ సిఐ వై.సత్యకిషోర్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. కోరుకొండ సర్కిల్ పరిధిలోని గోకవరం, సీతానగరం, కోరుకొండ స్టేషన్ల సిబ్బందికి కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సంక్రాంతి నేపథ్యంలో కోడి కత్తులు తయారుచేయడం, పందేలకు స్థలాలు సిద్ధం చేయడం వంటి వాటిని గుర్తించాలన్నారు. జూదాల నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ర్యాంగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికగా అవమానకరంగా మాట్లాడితే కేసులు నమోదు చేయాలన్నారు. జూదాలు, సారా, మద్యం అక్రమ రవాణాలపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని ప్రజలకు సూచించారు.

పేదలకు అండగా ప్రభుత్వం : ఎంఎల్‌ఎ మద్దిపాటి

ప్రజాశక్తి - గోపాలపురం

సాయం అందిస్తున్న ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు

పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మండలంలోని దొండపూడి గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి రామకృష్ణ గుండె సంబంధిత సమస్యతో బాధ పడుతున్నారు. ఆయనకు వైద్యం ఖర్చులు నిమిత్తం రూ.5 లక్షలను ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు మంగళవారం అందించారు. దొండపూడి గ్రామ కమిటీ అధ్యక్షులు ముత్యాలరాయుడు మాట్లాడుతూ బలరామకష్ణ గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాదులో యశోద ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. వైద్యం కోసం రూ.10లక్షల వరకూ ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవిస్తూ ఉంటే కుటుంబం ఇంత మొత్తాన్ని చెల్లించే పరిస్థితి లేదన్నారు. ఈ సమస్యను ముత్యాల రాయుడు ఎంఎల్‌ఎ దష్టికి తీసుకువెళ్లారు. ఎంఎల్‌ఎ వెంకట్రాజు అసెంబ్లీ సమావేశంలో ఉండగానే స్పందించి రూ.5లక్షల ఎల్ఓసిని అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బండారు గన్ని రాజు, నాయకులు పాల్నాటి రాజేంద్ర, షేక్ బద్రి, కార్యదర్శి వెల్లంకి జయ శివ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నడిమిలంకలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు యువకులు గాయపడ్డారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గొల్లలమామిడాడకు చెందిన యు.అనుకుమార్, యు.అభిషేక్, ఎ.సురేష్ కోత మిషన్ ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. వీరు మచిలీపట్నం నుంచి మంగళవారం తెల్లవారుజామున గొల్లల మామిడాడ వెళుతున్నారు. ఈ సమయంలో ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని నడిమిలంక సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అనుకుమార్(23) అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన అభిషేక్, సురేష్ చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ జి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న లారీ

భర్త మృతి, భార్యకు గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామ శివారు జాతీయ రహదారి పక్కనే ఆగి ఉన్న మోటార్ సైకిల్ ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయాలపాలయ్యారు. ఎస్ఐ శివనాగు తెలిపిన వివరాల ప్రకారం...కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన చల్ల వెంకటరమణ అతని భార్య లక్ష్మీ కలిసి మోటార్ సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తూ మండలంలోని మురారి గ్రామం శివారున ఆగారు. అదే సమయంలో లారీ వేగంగా వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణ(53) తలకు బలమైన గాయ కావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లే సమయానికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని తెలిపారు. అతని భార్య గాయాలతో బయటపడిందని, ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

30 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని నీలపల్లి రహదారిలో ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యాన్ని తరలిస్తున్న కాలా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 30 మద్యం సీసాలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ. నాగేంద్ర కృష్ణ తెలిపారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని జె. కొత్తూరు గ్రామంలో నిర్వమిస్తున్న సారా బట్టీపై దాడి చేసినట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. కొత్తూరు గ్రామానికి చెందిన వి.దుర్గయ్య నాటు సారా బట్టీ నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేశామని, ఈ దాడిలో 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన 16 మంది అరెస్ట్

ప్రజాశక్తి - తుని

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన 16 మందిపై కేసులను నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సిఐలు జి.చెన్నకేశవరావు, ఎం. గీతారామకృష్ణ తెలిపారు. మంగళవారం తుని రూరల్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సోషల్ మీడియా ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో ప్రభుత్వ పెద్దలను, వారి మనోభావాలను దెబ్బతీస్తూ పార్టీల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన తుని పట్టణం, తుని రూరల్ పరిధిలో ఉన్న చింతమనేని గణేష్, కాకినాడ గణేష్, నాగం దొరబాబు, అడపా సురేష్, ఎ.గణేష్ వీరవెంకటరమణ, చింతకాయల చినబాబు, బండారు బ్రహ్మానాయుడు, షేక్ క్వాజా, ఏలూరు బాలు, ఎలిగొండ జార్జ్ కిరణ్, ఈసరపు సాయి, మగసిల నాగ శ్రీను, దిబ్బ శ్రీను, పెనుగొండ వెంకటరమణ, కొరుప్రోలు లలితలపై కేసులు నమోదు చేసి కొంతమందిని కోర్టుకు తరలించడం జరిగిందన్నారు. వీరిలో కొంతమందికి బెయిల్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. మరి కొంతమందిని ఐడెంటిఫై చేసి వారిని కూడా అరెస్ట్ చేస్తామని చెప్పారు. యువకులు సోషల్ మీడియా ద్వారా వేరువేరు గ్రూపుల్లో వచ్చిన పోస్టులను మరొక గ్రూపులో షేర్ చేసే వారిపైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఏడుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

ప్రజాశక్తి - పిఠాపురం

మద్యం సేవించి వాహనం నడిపుతున్న ఏడుగురుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఉప్పాడ బస్‌స్టాండ్ సెంటర్, పాదగయ జంక్షన్‌లో పిఠాపురం పట్టణ, గ్రామీణ, గొల్లప్రోలు, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ల సిబ్బందితో కలిసి ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలు సరిగ్గా ఉన్నాయో, డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిశీలించారు. ఆటో డ్రైవర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రఘువీర్ విష్ణు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపిన, నిబంధనలు పాటించకున్న చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు మణికుమార్, గుణశేఖర్, రామకృష్ణ, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

13 మందికి జరిమానా, ముగ్గురికి జైలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మద్యం తాగి వాహనం నడుపుతున్న కొందరికి జైలు శిక్ష, పలువురికి జరిమానా విధించినట్లు కోరంగి ఎస్ఐ.సత్యనారాయణ తెలిపారు. సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 16 మందిలో 13 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించని ముగ్గురికి 2 రోజులు జైలు శిక్ష విధించారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న పదిమందికి ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కాట్రావులపల్లి నుంచి రామేశంపేట వెళ్లే రహదారిలో పలు ప్రాంతాలను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు.

ఆరోగ్యవంతమైన సమాజం అందరి బాధ్యత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం అందరి బాధ్యత అని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం కలక్టరేట్‌లో జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

దేవరపల్లిలో...

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణా వ్యవస్థను మెరుగు పర్చుకోవాలన్నారు. డిఆర్‌డిఎ ద్వారా మహిళల, ప్రజల భాగస్వామ్యం చేసి మరుగుదొడ్ల వినియోగం పెంచాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణా సామర్థ్యం పెంచడం ద్వారా గ్రామ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. పారిశుధ్య కార్మికులను ప్రోత్సహించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, అంగన్‌వాడీ సెంటర్స్, గ్రామాల్లో ఉన్న కమ్యూనిటీ టాయిలెట్స్‌ని కూడా మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల, అంగన్‌వాడీ, ప్రభుత్వ ఆసుపత్రి వారికి టాయిలెట్‌ల నిర్వహణలో పోటీలు నిర్వహించాలన్నారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేల నగదు పురస్కారం అందించాలన్నారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యశాఖ, కార్య నిర్వహణ అధికారి బి.వెంకటగిరి మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్లను గుర్తించి వాటిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులు అంజే వీరమ్మ, నల్లేపు సింహాచలం, పేరంపాలి వీరాస్వామి, ఎ.బేబి, మేరీ, విజయలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి, ఇన్‌ఛార్జి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం.నాగలత, డిఎస్ఇఒ కె.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం : వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సమాజం ఆరోగ్య వంతంగా ఉంటుందని హెచ్ఎం శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి అన్నారు. మంగళవారం చిట్యాల జడ్‌పి ఉన్నత పాఠశాలలో 'వరల్డ్ టాయిలెట్స్ డే'ను నిర్వహించారు. మరుగుదొడ్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ అబ్బులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, సిఆర్‌పి కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కడియం : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో

కడియంలో అవగాహనా ర్యాలీ

మంగళవారం మరుగుదొడ్లపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వేమగిరిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రమేష్ మాట్లాడారు. అనంతరం వేమగిరి జిల్లా పరిషత్ హైస్కూల్లో టాయిలెట్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఐ అల్లు వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కె.శ్రీనివాస్, పరిపాలన అధికారి పి.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

దేవరపల్లి : మంగళవారం దేవరపల్లిలో జడ్‌పిహెచ్‌ఎస్‌లో ప్రపంచ టాయిలెట్స్ డేను నిర్వహించారు. మరుగుదొడ్ల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ, ఇఒపిఆర్‌డి, హెచ్ఎం ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెచ్చని నేస్తాలు వచ్చేశాయ్...

ప్రజాశక్తి - కోరుకొండ

జిల్లాలను మంచు పరదాలు కప్పేస్తున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. వణుకు పుట్టించే చలిగాలులు వీస్తున్నాయి. వీటన్నింటి నుంచి కాపాడుతూ శరీరానికి వెచ్చదనాన్ని అందించేందుకు మంలానికి వెచ్చని నేస్తాలు వచ్చేశాయి. కోరుకొండ మండలంలో తోటలు, చెరువులు, కాలువలు ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువ. ఇప్పటికే ఈ వాతావరణం మండలంలో నెలకొంది. దీంతో ఉన్ని దుస్తుల దుకాణాలు క్రమంగా వెలుస్తున్నాయి. రాజమహేంద్రవరం - గోకవరం రోడ్డులోని కాపవరం, కోరుకొండ, పశ్చిమగోనగూడెం గ్రామాల సెంటర్లలో ఉన్ని దుస్తుల వ్యాపారాలు జోరందుకున్నాయి. నేపాల్‌తో పాటూ ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడ దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. నేపాల్, రాజస్తాన్, ఢిల్లీ, ఆగ్రా ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడి వచ్చారు. మార్చి వరకూ ఇక్కడ వారు ఉన్ని వస్త్రాలను అమ్ముకుని తిరిగి వారి గమ్యస్థానాలకు వెళ్లిపోతున్నారు. స్వెటర్లు, మంకీ క్యాప్, మఫ్లర్లు, రగ్గులు, బెడ్‌షీట్లు వీరి వద్ద దొరుకుతాయి. అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి వృద్ధుల వరకూ అవసరైమన అన్ని వెరైటీ ఉన్ని దుస్తులు వీరి వద్ద అందుబాటులో ఉంటాయి.

రూ.200 నుంచి రూ.2వేల వరకూ ధరల్లో ఇవి లభ్యమవుతున్నాయి. పదేళ్ల నుంచి ఇక్కడ వ్యాపారం చేస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు.

మారుమూల గ్రామాలకు బస్సులు నడపాలి

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలోని మారుమూల గ్రామాలకు ఆర్‌టిసి బస్సులను నడపాలని పలువురు కోరుతున్నారు. కోరుకొండ నుంచి దోసకాయలపల్లి, నిడిగట్ల, పాలచర్ల, దివాన్ చెరువు మీదుగా రాజమహేంద్రవరానికి, కోరుకొండ-రాజానగరం, కోరుకొండ-సీతానగరం సర్వీసులను పెంచాలని ప్రజలు కోరుతున్నారు. కోరుకొండ-గాదరాడ, కోరుకొండ-కణుపూరు సర్వీసులను వేయాలని కోరుతున్నారు. కోరుకొండ నుంచి కాకినాడ, అన్నవరం గతంలో ఉన్న సర్వీసులను తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ సర్వీసులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

8 నుంచి వికలాంగుల క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

డిసెంబర్ 8 నుంచి విశాఖలో జరిగే పది జిల్లాల వికలాంగుల క్రికెట్ టోర్నీని విజయవంతం చేయాలని జిల్లా జట్టు కెప్టెన్ పి.బలరామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం రాజమహేంద్రవరం వై జంక్షన్ వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జిల్లా ఇన్‌ఛార్జి పల్నాటి బలరామకష్ణ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీకి సంబంధించి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అఖిలభారత దివ్యాంగుల హక్కుల జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్ మాట్లాడుతూ విశాఖ గాజువాక జింక్ గ్రౌండ్‌లో ఈ టోర్నీ జరుగుతుందన్నారు. పాల్గొనదల్చిన ఉత్సాహవంతమైన దివ్యాంగ క్రీడాకారులు 9885864940, 9247386666 నెంబర్లను సంప్రదించాలన్నారు. 22న లాలాచెరువు గ్రౌండ్‌లో సెలక్షన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డి.హరీష్, ఎ.అఖిల్, ఎం.చంద్రమౌళి, రాము, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం సంజీవ్ నగర్ కాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలను మంగళవారం తొలగించారు. తుప్పలు రహదారిని ఆక్రమించడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా సర్పాలు రోడ్డుపైకి రావడంతో బెంబేలెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి శిరీష తక్షణమే స్పందించి తుప్పల తొలగింపు చేపట్టారు. ఈ పనులను స్వయంగా పర్యవేక్షించారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ బిఎస్ఎస్.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలపురం మండలంలోని 18 గ్రామ సచివాలయాలు వద్ద ఈనెల 19 నుంచి 22 వరకూ ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. గోపాలపురం, చిట్యాల, వెళ్లచింతలగూడెం, గుడ్డిగూడెం, వెంకటాయపాలెం, కరగపాడు, కరిచర్లగూడెం, సగ్గొండ గ్రామ సచివాలయాల్లో ఈ క్యాంపులు ఉంటాయన్నారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయన్నారు.

పొగాకు పంటలో నియంత్రణ పాటించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

పొగాకు బోర్డు అనుమతి మేరకే పంటలు పండించాలని పొగాకు సాగులో నియంత్రణ పాటించాలని గుంటూరు పొగాకు బోర్డ్ చైర్మన్ సిహెచ్.యశ్వంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఎన్ఎల్ఎస్ పరిధిలోని ఐదు పొగాకు బోర్డులను సందర్శించారు. రైతులకు, బోర్డు సిబ్బందితో సమావేశమయ్యారు. రాజమహేంద్రవరం రీజనల్ మేనేజర్ జిఎల్‌కె.ప్రసాద్, వేలం నిర్వహణ అధికారి అమూల్ డి.శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ పొగాకు బోర్డు నిర్దేశించిన కోట పరిమాణం ఒక బేరనుకు 4125 కేజీలు మించి పంట పండించరాదన్నారు. బోర్డు సూచించిన పంటకు మించి అదనంగా పండిస్తే అపరాధ

సమావేశంలో మాట్లాడుతున్న యశ్వంత్ కుమార్

రుసుము విధిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు ఇల్లూరి రాంబాబు, పిన్నమనేని మధుమోహన్, గద్దె శేషగిరిరావు, కొర్లపాటి అన్నవరం, నందమూరి సత్యనారాయణ, కూసం రామ్మోహన్ రెడ్డి,పరిమి జగదీష్, తదితర రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి

ప్రజాశక్తి - గోపాలపురం

ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని ఎంఇఒ జి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గోపాలపురం హై స్కూల్లో బయోలాజికల్ సైన్స్, చిట్యాల హై స్కూల్లో మాథ్స్, రాజంపాలెం హైస్కూల్లో తెలుగు, కొవ్వూరుపాడు హైస్కూల్లో ప్రైమరీ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధనను అందించాలన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచడంతో పాటు విద్యార్థుల సృజనాత్మకత నైపుణ్యాలను మెరుగుపరచాలని సూచించారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

ప్రజాశక్తి- కడియం

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల, వైఎస్.విజయమ్మ, వివేకానంద రెడ్డి కుమార్తె వైఎస్.సునీత కుటుంబసభ్యులపై సోషల్ మీడియాలో వచ్చిన అసభ్యకరమైన పోస్టులపై తాడాల కొండరాజు కడియం పోలీస్‌లకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రరెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి, కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలంటూ కడియం పోలీస్‌లను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో పాతంశెట్టి మహాలక్ష్మి, ఉల్లిశెట్టి సత్తిబాబు, కొత్తపల్లి జడ్జి, పేరిచర్ల సత్యనారాయణరాజు, తాడాల రాజు, తాడాల రామకృష్ణ, నాగిరెడ్డి వీరగోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

జడ్‌పి పాఠశాలలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరంరూరల్

బొమ్మూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీశారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు అందచేసే బోధన సంబంధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సిబ్బంది ఆదేశించారు. వేడి ఆహార పదార్థాలను పిల్లలకి వడ్డించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

బెల్టుషాపులు, జూదాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి నరసింహ కిషోర్ హెచ్చరించారు. మంగళవారం తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది తీరుపై ఆరా తీశారు. సిబ్బంది కొరతపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎస్‌పి బదులిస్తూ బదిలీల అనంతరం అన్ని స్టేషన్లలోనూ సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట డిఎస్‌పి దేవకుమార్, రూరల్ సిఐ విజయబాబు, స్పెషల్ బ్రాంచ్ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ టి.రామకృష్ణ ఉన్నారు.

బిక్కవోలు జడ్‌పిహెచ్‌ఎస్‌లో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - బిక్కవోలు

బిక్కవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఇఒ కె.పూర్ణ చంద్రరావు తనిఖీలు నిర్వహించారు. అపార్ నమోదును పరిశీలించారు. అనంతరం మిడ్డే మీల్స్‌లో నాణ్యతను పరిశీలించారు. పదవ తరగతి సిలబస్ ఎంతవరకు

అపార్ నమోదును పరిశీలిస్తున్న ఎంఇఒ

పూర్తయిందనే దానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెలుగు సబ్జెక్ట్‌పై జరుగుతున్న కాంప్లెక్స్ మీటింగ్‌ను పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామంలోని ప్రమాదపు మలుపు వద్ద వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని రెడ్డి చెరువు గ్రామంలో కాలువపై వంతెన నిర్మించి, ప్రమాదాల నుంచి కాపాడాలని టిడిపి సీనియర్ నాయకులు చెల్లెంకి నూకరాజు, పిల్లి కేశవరావు, పిల్లి

రోడ్డులో కలిసిపోయిన వంతెన రక్షణ గోడలు

గోపాలకృష్ణమూర్తి, చెల్లెంకి సత్యనారాయణ, చెల్లెంకి వెంకటేశ్వరరావు, చెల్లెంకి మురళీకృష్ణ, కుడిపూడి దుర్గారావు తదితర స్థానికులు కోరుతున్నారు. 20 ఏళ్లగా పలుమార్లు రహదారులు నిర్మించడంతో వంతెన రోడ్డు కంటే కిందికి వెళ్లిపోయిందన్నారు. వంతెన రక్షణ గోడలతో సమానంగా రోడ్డు ఉందన్నారు. దీంతో వంతెన ప్రమాదకరంగా మారిందన్నారు. వాహనదారులకు కాలువ, వంతెన రెండూ కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.కాలువకు ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాన్ని పూడ్చి, రోడ్డు పెంచుకుంటే ప్రమాదాలను తగ్గించే వీలుందన్నారు. ఇంతవరకు ప్రాణానష్టం లేకపోయినప్పటికీ పదుల సంఖ్యలో వాహనదారులు గాయాల పాలవుతున్నారన్నారు. నిత్యం వందలాది మంది ఈ వంతెనపైనుంచి రాకపోకలు సాధిస్తారన్నారు. పలు విద్యాసంస్థలకు చెందిన బస్సులు, వ్యానులు ఈ రహదారిపై నుంచే వెళ్తాయన్నరు. పశ్చిమగోదావరి జిల్లా, దువ్వ వైపు నుంచి ఉండ్రాజవరం చేరుకోవాలంటే ఇదే రహదారిపై నుంచి ప్రయాణం సాగిస్తారన్నారు. ఇప్పటికే మంత్రి కందుల దుర్గేష్, నిడదవోలు మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావుకు సమస్యను విన్నవించినట్లు వారు తెలిపారు. పాలకులు, అధికారులు గమనించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కలుషిత చెరువుతో ఇబ్బందులు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో అజ్జరం గ్రామం మధ్యలో ఉన్న పంచాయతీ చెరువు కలుషితంగా మారింది. తీవ్ర దుర్గాంధాన్ని వెదజల్లుతోంది. చెరువును ఆనుకుని ఉన్న ఆవాసాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నివాసాల మరుగుదొడ్లు, వాడకపు నీరు నేరుగా చెరువులో కలవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. చెరువు నీరంతా పచ్చగా మారిపోయింది. చెరువును ఆనుకుని చేతిపంపులు ఉన్నాయి. చెరువు కాలుష్యం కారణంగా ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు సైతం కలుషితమయ్యాయని, చెరువు చెంతన ఉన్న బోర్ల నుంచి వస్తున్న నీటిని తాగుతుంటే రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివాసాల మధ్యలో మురుగు కూపంగా మారిన చెరువును పంచాయతీ వారు పూడ్చి వేయకుండా కాలయాపన చేస్తూ కాలం గడుపుతున్నారని వారంటున్నారు. వర్షాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. చెరువులోకి మురుగునీరు కూడా చేరడంతో మరింత దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. మురుగునీటి చెరువుగా మారడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయని చెబుతున్నారు. రాత్రి వేళల్లో కంటిపై కునుకు కరువవుతుందని వారు వాపోతున్నారు. చెరువును పూడ్చివేయాలని వారు కోరుతున్నారు.

పది, ఇంటర్ తత్కాల్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఓపెన్ స్కూల్ నందు పదవ తరగతి, ఇంటర్మీడియట్ 2024-25 సంవత్సరం అడ్మిషన్లు తత్కాల్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. అపరాధ రుసుము రు.600తో ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎపి ఆన్ లైన్ కేంద్రాల ద్వారా చెల్లించాలన్నారు. ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ విద్యార్థులు ప్రాస్పెక్టస్ కం అప్లికేషను ఫారం సంబంధిత స్టడీ సెంటర్ నుంచి ఉచితముగా పొందొచ్చన్నారు. వివరాలను పూరించి సంబంధిత కో-ఆర్డినేటర్ ద్వారా తప్పులు ఏమైనా ఉంటే సరిచూసుకొని ఎపి ఆన్‌లైన్ కేంద్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆన్ లైన్ అప్లికేషను జిరాక్స్ కాఫీని, ఫీజు రసీదును సంబంధిత ఎ1 కేంద్రానికి ఇవ్వాలన్నారు. 30 రోజులు విధిగా తరగతులకు హాజరుకావాలన్నారు. స్టడీ సెంటర్‌లో ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వివరాలకు సమీపంలోని ఎ1కేంద్రాలను లేదా జిల్లా కో-ఆర్డినేటర్ (8977645704)ను సంప్రదించాలన్నారు..

ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించండి

ప్రజాశక్తి - కోరుకొండ

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమన కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నిధులు కేటాయించి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో రాజానగరం నియోజకవర్గంలోని పలు ఆలయాల పరిస్థితిని సభ దృష్టికి తీసుకెళ్లారు. కోరుకొండ ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి, బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని దేవాదాయ శాఖ మంత్రిని కోరారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి అనుబంధమైన శ్రీ రంగనాథ స్వామి ఆలయం కూడా అత్యంత పురాతనమైన ఆలయమన్నారు. దీన్ని పున్ణనిర్మించడానికి నిధులు కేటాయించాలన్నారు. కోరుకొండ సమీపంలోని కణుపూరులో కొండపైన ఉన్న భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. నియోజకవర్గంలో సిఐ, డిఎస్‌పి కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని వాటికి సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులకు, సిబ్బంది నివాసానికి వసతి కూడా లేదన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించే పోలీస్ శాఖకు సరైన సదుపాయాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. లోన్ యాప్‌లను అరికట్టాలన్నారు.

60 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- మండపేట

మండపేట మండలం పాలతోడులో శ్రీ బాపనమ్మ తల్లి ఆలయ చైర్మన్ యేలేటి వెంకటరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 60 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వరి రామకష్ణ లయన్స్ నేత్ర వైద్యశాల, హైదరాబాద్ ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సిబ్బంది వైద్య

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సేవలు అందించారు. క్యాంప్ ఇన్‌ఛార్జి డాక్టర్ సిహెచ్.నాగరాజు మాట్లాడుతూ అత్యాధునిక విదేశీ పరికరాలతో ఆరోగ్యశ్రీ, తెల్ల రేషన్ కార్డు గలవారికి కుట్లు లేని కంటి ఆపరేషన్లు పేకోమిషన్ ద్వారా ఉచితంగా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిల్లా తాతాలు, యేలేటి రామచంద్రరావు, మండిపూడి చంద్రశేఖర్, అన్నందేవుల సూర్యచంద్రరావు, అన్నందేవుల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, VEERA VENKATA SIVA NAGA SURESH BAVISETTI, Son of VEERA VENKATA VARA PRASADA RAO BAVISETTI, Resident of D.No. 4-35, Panduru, Kakinada, Andhra Pradesh - 533005 have changed my name from **VEERA VENKATA SIVA NAGA SURESH BAVISETTI** (Old Name) to **SURESH BAVISETTI** (New Name). Henceforth, I shall be known as **SURESH BAVISETTI** for all purposes.

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం, గండేపల్లి గ్రామానికి చెందిన దుంగల మాధవి రమాదేవి, భర్త: నాగేశ్వరరావు (లేటు), డోర్ నెం. 1-43, గండేపల్లి గ్రామంలో నివసిస్తున్నాను. జగ్గంపేట సబ్ రిజిస్టర్ నందు నా పేరున రిజిస్టర్ కాబడిన సర్వే నంబర్ 424-1 రిజిస్టర్డ్ దస్తావేజులు ది. 12-11-2024వ తేదీన గండేపల్లి నుండి జగ్గంపేట తీసుకొని వెళ్ళుచుండగా దారిలో పడిపోయినవి. నేను ఎంత వెతికిననూ నా డాక్యుమెంట్స్ దొరకలేదు. దొరికినవారు ఈక్రింది నెంబరుకు తెలియజేయగలరు.

సెల్: 81068 25807 9494666784

IN THE COURT OF THE AGENT TO GOVERNMENT (DIST.COLLECOTR) AT KOTHAGUDEM.
O.S.NO. 249 OF 2022

Between:
Godla Ramesh .... Plaintiff
Vs.
Kothapally Venkateswara Rao ..... Defendant

To,
Kothapally Venkateswara Rao
S/o Raju, Age: 40 yrs, Occ: Agriculture,
R/o Gogubaka Village, Yetapaka Mandal,
East Godavari District.

Whereas the plaintiff has filed the above suit for recovery of money on the file of Agent to Government District Collector at Kothagudem and the suit is posted on 07-12-2024 for appearance of any objections. Hence you are hereby informed to appear before this court on 07-12-2024 at 11:00 A.M either by yourself or through your counsel filing which the matter will be decided ex-parte

'By order of the court
MANTRIPRAGADA RAVI THEJA
Advocate

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.273/2023
In I.P. No.7/2023

Between
పట్నాల ఎన్. వి . ఈశ్వర రావు
... పిటిషనర్ /పిటిషనర్
మరియు
వాకాడ సత్యనారాయణ మరియు ఇతరులు .... రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్
R2 వాకాడ సత్యనారాయణ,
S/o.అప్పారావు C/o లేటు నందగిరి సంజీవరావు గారి ఇల్లు, 43 సం.లు, హిందూ, నిల్ R/o డోర్ నెం. 19-8-1 మైత్రి డిజైనర్స్ వీధి, రత్నంపేట, రామచంద్రపురం టౌన్ మరియు మండలం, R.C.P.J.C.J.C.

పై నెంబరు పిటిషన్ నందు R1 రెస్పాండెంట్ హాజరు నిమిత్తం **ది. 25-11-2024** వాయిదా అయి ఉన్నది. కావున మీరు ఆ రోజు **ఉదయం గం 10-30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాబడి మీ సంజాయిషీని తెలియజేసుకోవలెను. లేనిచో సదరు పిటిషన్ ను మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

రామచంద్రపురం
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
19-11-2024
కముజు సూర్యనారాయణ
వాది తరపు అడ్వకేటు
సెల్ :9849379828

ప్రకటన

మహారాజశ్రీ కాకినాడ 3వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 291/2024, I.A. No. 264/2012,
O.S. No. 16/2010

Between:
పిటీషనరు: యరమాటి వీర రాఘవులు
AND
రెస్పాండెంట్లు: వై.కృష్ణ, వగైరా
To:
4వ రెస్పాండెంటు: బొడ్డు సుబ్బాయమ్మ, W/o. రాజు, డో.నెం. 4-141, రామాలయం వీధి, గండ్రేడు, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు దావాలో పైన తెలిపిన 4వ రెస్పాండెంటునకు శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఎన్నిసార్లు సమనులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందు వలన సదరు పైన తెలిపిన 4వ రెస్పాండెంటు పై కోర్టు వారి ఎదుట ది. **29-11-2024**వ తేదీ **ఉదయం 10.30 ని॥లకు** హాజరయి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందుమూలంగా తెలియచేయడమైనది.

కాకినాడ
15-11-2024
మెర్ల సూర్యనారాయణ
మల్లంపల్లి సర్వేశ్వరరావు
అడ్వకేట్స్, కాకినాడ